క్లుప్తంగా

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: మండలంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరు నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు మండలంలోని గ్రామ సచివాలయాలలో 512 మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా మరో 342 మంది నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు.

8న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల 2011–12 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేనం జూన్ 8న పాఠశాల ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ గోవిందు బాలస్వామి, ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011–12 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు హాజరవుతారని చెప్పారు.

కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలి



మల్లవరం(రెంటచింతల): స్థానిక శివాలయం దేవస్థానం భూములకు సంబంధించిన కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆలయ ఈఓ గాదె రామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక శివాలయం దేవస్థానం ఆవరణలో ఆలయ భూములను కౌలుకు తీసుకున్న రైతులతో సమావేశం నిర్వహించారు. బకాయిలు ఉన్న కౌలు రైతులు దేవాదాయ శాఖ అధికారులకు బకాయిలు చెల్లించి సహకరించాలని కోరారు. బహిరంగ వేలం పాటల ద్వారా ఆలయ భూములు పొందిన కౌలుదారులు అందరూ కూడా సకాలంలో ముందు కౌలు చెల్లించాలని కోరారు. సమావేశంలో అర్చకులు శివయ్య పాల్గొన్నారు.

యోగాతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం సాధ్యం

మిట్టగుడిపాడు(రెంటచింతల): ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ప్రతి దినం కొంత సమయం యోగా చేయడం వలన వారికి పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని మిట్టగుడిపాడు సర్పంచి గొట్టం ప్రమీల గురవారెడ్డి అన్నారు. బుధవారం ప్రిపేర్ నెస్ టు యోగా కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాయం వద్ద అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు, ప్రజలకు యోగాపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తొలుత మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి మాదూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చిన్న, సన్న కారు రైతులకు సబ్సిడీ



మాచర్ల రూరల్: చిన్న, సన్న, కారుల రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా 18 రకాల పండ్ల తోటల పెంపకానికి వందశాతం సబ్సిడీ అందజేయనున్నట్లు పల్నాడు జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష తెలిపారు. మండలంలోని తాళ్లపల్లి, ఏకోనాంపేట గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతన్నలకు అండగా ఉండేందుకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. వాణిజ్య పంటల ద్వారానే రైతులకు ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగ శ్రీనివాస్, జేఈ గోపి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకయ్య, కిషోర్ పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

యడ్లపాడు: మండలంలోని యడ్లపాడు, తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి – ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ జ్ఞాన గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కర్మయోగం, భక్తియోగం, బ్రహ్మయోగం వంటివి దైవ ధర్మాలుగా చెప్పబడ్డాయని కమిటీ సభ్యులు స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘుడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, రామాంజనేయులు, పగడాల రామయ్య, అశోక్, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, సానికొమ్ము రాజశేఖరరెడ్డి, వెల్చా రాజేష్ పాల్గొన్నారు.

కోడింగ్‌పై ఉచిత శిక్షణ

వినుకొండ: ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ పూర్తిచేసి బీటెక్‌లో చేరబోయే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా కోడింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఇందూరి రామాంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ఉంటాయి.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- గ్రామాలలో విస్తరిస్తున్న గంజాయి వాడకం
- మైనర్లపైనే అధిక ప్రభావం
- అప్రమత్తమవ్వాల్సిన తల్లిదండ్రులు



గతంలో దిడుగు దగ్గర పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు

అమరావతి: గంజాయి మాదకద్రవ్యాన్ని వినియోగిస్తున్న వారిలో మైనర్లు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తుంది. చాప కింద నీరులా గంజాయి, మాదక ద్రవ్యాలు ఇప్పుడు పల్లెల్లో సామాన్యుల ఇళ్లలోకి ప్రవేశించాయి.

- గతంలో సుమారు పది కిలోలకు పైగా గంజాయి రవాణా చేస్తుంటే మండల పరిధిలోని దిడుగు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఇటీవల ధరణికోటలో యువకులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ దాడులలో పట్టుబడ్డ వారంతా దాదాపు 30 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే తొలుత జాగ్రత్త పడాల్సింది తల్లిదండ్రులే అని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

గ్రామాలలోనూ అందుబాటులో...

గ్రామాలలోనూ గంజాయి దొరుకుతుండటంతో యువత అందులో ఉండే మత్తుకు అధికంగా ఆకర్షితులవుతున్నారు. మండలంలోని అత్యధిక గ్రామాలలో గంజాయి అందుబాటులోకి వచ్చింది. రకరకాలుగా రవాణా చేసి యువకులకు అందించి అధికంగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో ఊరికి దూరంగా ఉన్న ప్రదేశాలలోని భవనాలలో అలాగే పూర్తికాని జగనన్న కాలనీలలో, రియల్ ఎస్టేట్ వెంచర్‌లలో అమరావతిలో కృష్ణానది ఒడ్డున చెట్టు మీద అధికంగా గంజాయి సేవనం.. అది కూడా రాత్రి వేళల్లో జరుగుతుండటంతో ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. మద్యం కంటే గంజాయి తక్కువ రేటుకు వస్తుందనే ఆలోచనతో యువత అధికంగా గంజాయికి అలవాటు పడుతున్నారు. అలాగే ఇటీవల కొత్తగా లిక్విడ్ గంజాయి, గంజాయి సిగరెట్‌లు.. వంటివి అందుబాటులోకి వచ్చాయని వాటిని రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.



ఇటీవల ధరణికోటలో స్వాధీనం చేసుకున్న గంజాయి

దొంగతనాలు.. అబద్ధాలు

గంజాయికి అలవాటు పడ్డాక, డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడడం మొదలు పెడుతున్నారు. గంజాయి తేలిగ్గా దొరకడంతో దానికి అలవాటు పడిన వారు స్నేహితులనూ ఈ ఊబిలోకి దించుతున్నారు. సాధారణంగానే పిల్లల మీద స్నేహితుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో స్నేహితుల కోసం తీసుకుని అలవాటు పడిన వారే ఎక్కువగా ఉంటున్నారు. అమాయకులైన మైనర్లకు అలవాటు చేయడం తేలిక కాబట్టే వ్యాపారులు కూడా వారినే టార్గెట్ చేసుకుంటున్నారు. పది ప్యాకెట్లు అమ్మితే ఒకటి ఉచితంగా ఇస్తామని, రూ.100కు కొని రూ.200కు అమ్ముకోవచ్చని పేద పిల్లలకు ఆశ చూపించి ఈ రొంపిలోకి దింపుతున్నారు. గంజాయికి అలవాటు పడిన వారు ఇంట్లో అబద్ధాలు చెప్పటం, చిన్న చిన్న దొంగతనాలు చేయటం అలవాటు చేసుకుంటున్నారు. ఇంట్లో వీలు కాకపోతే బయట కూడా దొంగతనాలు చేయటానికి వెనుకాడటం లేదు. అలాగే విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో గొడవలకు దిగి కేసులలో ఇరుక్కుని భవిష్యత్ పాడు చేసుకుంటున్నారు.

ఇలా కనిపెట్టవచ్చు...

పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలను బట్టి వాళ్లు గంజయి తీసుకుంటున్నారని కనిపెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలవాటు పడ్డ వారు చదువు.. పని.. దేని మీద శ్రద్ధ పెట్టలేరని, నీరసంగా మత్తుగా ఉండడం, తిండి సరిగా తినకపోవడం, బరువు తగ్గడం, శుభ్రత పాటించకపోవడం, అతిగా నిద్రపోవడం, చిన్న, చిన్న విషయాలకు చిరాకుపడడం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, మాటలకు చేతలకు పోలిక లేకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి లక్షణాలను సునిశితంగా పరిశీలించి వైద్య చికిత్స అందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లల కదలికలపై శ్రద్ధ పెట్టాలి

చదువుకుంటున్న పిల్లలు గంజాయికి అలవాటు పడి, పలు అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొని విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలను గంజాయి బారిన పడకుండా చూసుకోవాలి. ఎవరైనా వారిని అలవాటుకు ఉసిగొల్పినా, అలాగే గంజాయి విక్రయిస్తున్నారనే అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలి.

– అచ్చియ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అమరావతి

రేషన్ పంపిణీ విధానంలో మార్పు

తహసీల్దార్ విజయశ్రీ



యడ్లపాడు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జూన్ 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ తిరిగి రేషన్ షాపుల వద్దనే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ బుధవారం తెలిపారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసిన విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని, ఇకపై మళ్లీ షాపుల నుంచే పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. రేషన్ డీలర్లు ప్రభుత్వ లైసెన్సు పొందిన షాపుల్లోనే నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టాలని ఆమె సూచించారు. అంతేగాక, షాపుల్లో స్టాక్ నిల్వ సామర్థ్యం, డిజిటల్ తూకాల వాడకాన్ని అధికారులు పరిశీలించి అనుమతినిస్తారని పేర్కొన్నారు. పంపిణీ వివరాలు, సమయాల బోర్డులు షాపుల్లో ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్ల పైబడి వృద్ధులు, దివ్యాంగుల జాబితాను గుర్తించి, వారికి సరుకులు ఇంటి వద్దకే అందించాలని ఆమె ఆదేశించారు. ఇప్పటికే డీలర్లతో సమావేశం నిర్వహించి అన్ని మార్గదర్శకాలు తెలియజేశామని, జూన్ 1 నుండి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ శిబిరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరుగుతుందని చెప్పారు.

శావల్యాపురం: ఇక నుంచి రేషన్‌డీలర్లు రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణి పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 25 రేషన్ దుకాణాలు, 11 వేల కార్డులు ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలు మేరకు వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు దుకాణాలు వద్దనే రేషన్ పంచదార పంపిణి డీలర్లు చేయాలన్నారు. ప్రతి నెల 16వ తేదీ వరకు రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ చేయాలని, సమయాభావం మేరకు షాపులు నిర్వహణ చేయాలన్నారు. మండలంలో కార్డుదారుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా రేషన్‌డీలర్లు తమ విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఇక నుంచి రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాలు ద్వారా పంపిణీ చేయటం ప్రభుత్వ నిబంధనలు మేరకు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

వినుకొండ సినిమాహాళ్లలో అధికారుల తనిఖీలు



వినుకొండ: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని సురేష్‌మహల్, కీర్తి డీలక్స్, అరుణ సినిమా హాల్స్‌లో పారిశుద్ధ్యం, టికెట్‌ల ధర, లైసెన్సు, స్టాల్స్‌లో ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు సురేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సినిమా థియేటర్‌లలో తనిఖీలు చేపట్టామన్నారు. అధిక ధరలకు తినుబండారాల విక్రయాలు జరిపినా, లైసెన్సు లేకపోయినా, పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫిల్టర్ బెడ్స్‌కు రూ.10 లక్షలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు తాగునీరు ఫిల్టర్ అయ్యేలా చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి మిరియాల జ్యోత్స్నరాణి బుధవారం తెలిపారు. పంచాయతీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో మంచినీటి చెరువులో ప్రత్యేకంగా ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయడానికి పంచాయతీ సభ్యులు తీర్మానం చేశామని, గ్రామపెద్దల సహకారంతో ఆర్‌డబ్లూ ఏఈకు తీర్మానం చేసిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ఆర్‌డబ్లూ అధికారుల నుంచి సాంకేతిక అనుమతులు రాగానే గ్రామ పెద్దలు అధికారులు సారథ్యంలో పనులు ప్రారంభిస్తామన్నారు.

బాబూరావు సేవలు మరువలేనివి

కొరిటిపాడు (గుంటూరు): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యుడు బాబురావు సేవలు మరువలేనివని ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు వి.పాపారావు కొనియాడారు. మృతి చెందిన బాబూరావు మృతదేహాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వి.పాపారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నరసరావుపేట రూరల్ మండలం, ఇక్కుర్తి గ్రామం చేరుకుని బాబూరావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో అసోసియేషన్ నాయకులు వై.నాగరాజు, ఎం.గురవయ్య, కోటిరెడ్డి, నాగులు తదితరులున్నారు.

పమిడిమర్రులో కార్డెన్ సెర్చ్



తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసరావుపేట రూరల్: ఐక్యతతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రూరల్ సీఐ పి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎనిమిది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 80 మంది సిబ్బంది తనీఖీల్లో పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితులు ఇళ్లను, గడ్డివాములు, దుకాణాలు, బడ్డీకొట్లలో తనిఖీలు చేశారు. పలు కేసుల్లో నిందితులతో సమావేశం ఏర్పాటుచేసి పాత పంథాను మార్చుకోమని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీసుల తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 63 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలతో పాటు గొడ్డళ్లు, కర్రలు, పలుగులు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ పోలీసు రికార్డుల్లో పమిడిమర్రు సమస్యాత్మక గ్రామంగా ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులు సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేయకుండా మేమున్నామనే భావనను ప్రజలకు కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి, నాటు సారా నియంత్రణకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలో ఏదైన సమస్య వచ్చినప్పుడు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ ఎంవీ చరణ్, టూటౌన్ సీఐ హైమారావు, ఎస్‌ఐలు కిషోర్, వంశీకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ కళాజాత బృందం పట్టణంలోని బస్టాండ్ నందు వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుందని, ఎలా వ్యాపించదు, రాకుండా తీసుకోవాలని జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదని పలు అంశాలను నాటకాల ద్వారా వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌రాజు, ఐసీడీసీ సెంటర్ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూఎస్ ఆశ, డి.జయ, సీహెచ్. జకరయ్య, డి.రమేష్, వై.విజయ, బి.రిబ్కా, ఎస్‌కె రహమతున్నీసా,శైలజ, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఏపూరి ఏడుకొండలు వయస్సు 36 సంవత్సరాలు ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేయగా బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. రాజేశ్వరి తన భర్తకు డ్వాక్రా గ్రూపుకు చెల్లించాల్సిన నగదు రూ.21 వేలు ఇవ్వగా అవి సొంతానికి వాడుకున్నాడు. దీనిపై ఆమె భర్తను నిలదీసిందని, మరుసటి రోజు ఉదయం యథావిధిగా బయటకు వెళ్లి భర్త తిరిగి రాలేదని, చుట్టుపక్కల వెతికినా కనబడలేదని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మంచినీటి చెరువులు పరిశీలించిన అధికారులు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ఉన్న రక్షిత మంచినీటి చెరువులన్నీ ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ, పంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధుల సారథ్యంలో సాగర్ జలాలతో నూరుశాతం నింపేలా చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రత్నబాబు తెలిపారు. బుధవారం ఈపూ రు మండలంలోని పానుగోటివారిపాలెం, అగ్నిగుండాల, బొగ్గర, కొండ్రముట్ల గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులను సందర్శించి సాగర్ జలాల నింపే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఏడు నెలల గర్భిణికి అరుదైన చికిత్స

నరసరావుపేట: స్థానిక శకుంతల జనరల్ అండ్ గ్యాస్ట్రో లివర్ కేర్‌లో ఏడు నెలల గర్భిణికి ఎండోస్కోపీ ద్వారా అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆహాస్పిటల్ డాక్టర్ ఐలా శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కాకాని శ్రీ దివ్య అనే మహిళ పొట్టనొప్పి, కామెర్లతో ఇబ్బందిపడు తూ తమను సంప్రదించిందన్నారు. ఆమెను పరీక్షించి కామెర్లకు కారణం పసరునాళంలోకి రాళ్లు జారటంగా గుర్తించి ఎండోస్కోపీ ద్వారా ఎటువంటి కుట్లు, కోత, రేడియేషన్ లేకుండా ఈఆర్‌సీపీ శస్త్రచికిత్స ద్వారా పసరునాళంలో స్టంట్ అమర్చటం చేశామన్నారు.

విద్యార్థులకు పట్టుదల ఎంతో ముఖ్యం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ రె.ఫాదర్ గోవిందు బాలస్వామి

రెంటచింతల: జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యార్థులకు కృషితో పాటు పట్టుదల ఎంతో ముఖ్యమని స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ గోవిందు బాలస్వామి సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్య అనేది మనిషి జీవితంలో చాలా అవసరమని గుర్తించిన ఆర్‌సీఎం సంస్థ పల్నాడు ప్రాంతంలోని రెంటచింతలలో సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలను 1949లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ర్యాంకులు, మార్కులతో పాటు క్రమశిక్షణ, విలువలకు సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. వేలాదిమంది విద్యార్థులకు జ్ఞానంతో పాటు వారిలో దాగిన వ్యక్తిగత నైపుణ్యాలను సెయింట్ జోసఫ్స్ పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించి వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేసిన విషయాన్ని గుర్తుచేశారు. పాఠశాలలో 1992 బ్యాచ్ 10వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డి.అనూరాధ, ఎస్.యుగంధర్, ఎస్.హారికలకు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.5 వేలు చొప్పున అందచేసినట్లు హెచ్ఎం దుర్గా ప్రసాద్ కలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాంపాటి ఫాతిమా మర్రెడ్డి, శౌరయ్య, పాలువాయిగేటు సర్పంచ్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు పెరుమాళ్ల లక్ష్మణ్ రావు, కె. సువర్ణరాజు, గాదె నాగిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి హుస్సేన్

మాచవరం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మాచవరంలో సీపీఐ మండల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని చెన్నాయపాలెంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే నిర్మించేలా చూడాలని అన్నారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శిగా మోర్జంపాడు గ్రామానికి చెందిన నవులూరి యలమందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొమర వెంకటరావు, సీపీఐ నాయకులు పి.బాబూరావు, షేక్ నాగులమీరా, బి.కృష్ణారెడ్డి, ఎస్‌కే చాంద్‌బీ పాల్గొన్నారు.

న్యూటన్స్ కళాశాలకు అటానమస్ గుర్తింపు



అధ్యాపకులకు తినిపిస్తున్న కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి

మాచర్ల రూరల్: న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా వచ్చినట్లు కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడులో ఆధునిక, సాంకేతిక వసతులతో న్యూటన్స్ కళాశాలను ఏర్పాటు చేసిన 25 ఏళ్లు గడిసిందని చెప్పారు. కళాశాలలో వేలాది మందికి ఉన్నత విద్యనందించి వారి తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థుల ఉన్నతికి ఎంతగానో దోహదపడిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

6న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 6వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ అధ్యక్షతన జరగనున్నది. ఈ సమావేశం గురించి ఎంపీడీవో హేమలత దేవి మంగళవారం సమాచారం ఇచ్చారు. మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరగనున్నదని, ఎంపీపీ అనుమతితో ఇతర ముఖ్య అంశాలపై కూడా చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. సదరు సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు. అలాగే మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్స్‌తో బహుళ ప్రయోజనాలు



రైతు సేవా కేంద్రంలో విత్తనాలను ప్రదర్శించి ప్రయోజనాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నకరికల్లు: ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో 30 రకాల విత్తనాలను పొలంలో చల్లడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ఎస్ఎఫ్ఏ బి.అప్పలరాజు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానం వలన ప్రయోజనాలను బుధవారం రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రకాల విత్తనాలతో 50 కిట్స్‌ను సిద్ధం చేసి సచివాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. 20 కేజీల కిట్‌లో పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు.. అన్ని రకాల విత్తనాలు ఉంటాయన్నారు. అన్నిరకాల విత్తనాలు కలగలిపిన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్‌ను ప్రధాన పొలంలో వేయడం ద్వారా కలుపు నివారణ జరుగుతుందన్నారు. కూరగాయలు, ఆకుకూరలు కోసుకోవచ్చని.. పశువుల మేతగా వాడుకోవచ్చని, మిగిలిన మొక్కలు భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకొని ద్రవ, ఘన జీవామృతం, గ్రోత్ ప్రమోటర్‌లు, అంతరపంటలు వేయడం ద్వారా అధిక దిగుబడులు, అత్యధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏఎస్‌లు వై.ప్రభాకర్, షేక్.సుభాని, మాస్టర్ ట్రైనర్ బాజిబాబు, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జి సునీల్, ఐసీఆర్‌పీలు మల్లిఖార్జున, కొండలు, లక్ష్మి, విజయలక్ష్మి, వర్ధన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఒంటికి యోగా మంచిదేగా!

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామ సచివాలయం వద్ద బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, వెలుగు సీసీ సాంబశివరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం నెలరోజుల పాటూ యోగాంధ్ర కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ఉదయం యోగాసనాలు వేసి, యోగాతో లాభాల గురించి వివరించారు. ప్రతిరోజూ కనీసం గంట పాటూ యోగాసనాలు వేస్తే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో బుధవారం 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా తాలూకు ప్రాముఖ్యతను ప్రజల్లో పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు, పోటీలు ఏర్పాటు చేశారు. శ్వాసపట్ల ధ్యాసతో మానసిక ప్రశాంతత, శ్వాసకోశ సంబంధిత ఆరోగ్య సమస్యల నివారణకు ప్రాణాయామాలపై అవగాహన కల్పించారు.